క్లుప్తంగా

ఎర్రదొడ్డి చెరువుకు జలకళ



ఎల్ఎల్సీ నీటితో జలకళను సంతరించుకున్న ఎర్రదొడ్డి చెరువు

కోడుమూరు రూరల్: మండలంలోని ఎర్రదొడ్డి చెరువు జలకళను సంతరించుకుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఎర్రదొడ్డి చెరువు చుక్కనీరు లేకుండా పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఇరిగేషన్ అధికారులు మూడు వారాలుగా ఎల్ఎల్సీ నీటిని ఎర్రదొడ్డి చెరువుకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎల్సీ నీటి విడుదలతో ఎర్రదొడ్డి చెరువు జలకళను సంతరించుకుంది. చెరువుకు నీటి విడుదలతో చుట్టుపక్కల వ్యవసాయ బోర్లలో నీటి ఊటలు పెరగడంతో పాటు, పశువులకు తాగునీటి ఇబ్బందులు తీరిపోయాయని గ్రామస్తులు తెలిపారు.

ఆలయాల మూసివేత



కొత్తూరు ఆలయానికి తాళం వేస్తున్న అధికారులు

పాణ్యం: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలను ఆదివారం సాయంత్రం అధికారులు మూసివేశారు. మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 1 గంటకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గర్భగుడి తలుపులు మూసివేశారు. అలాగే ఆలయ ప్రధాన గాలిగోపురం తలుపులు మూసి వేసి తాళం వేశారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయాన్ని తెరచి శుద్ధి చేయనున్నారు.

- పాణ్యంలోని వీరనారాయణస్వామి, పాణికేశ్వరస్వామి ఆలయాలను అర్చకులు ప్రత్యేక పూజలు చేసి మూసివేశారు. గర్భగుడి, గాలిగోపురం తలుపులు మూసి తాళం వేశారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధి చేసి యాథావిధిగా పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

గడివేముల: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి ఆలయ తలుపులు మూసేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ తెలిపారు. తిరిగి సోమవారం వేకువజామున ఆలయ తలుపులు తీసి సంప్రోక్షణ, శుద్ధి పూజల అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనం ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తా

కర్నూలు (టౌన్): ద్వారక తిరుమలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 50వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కర్నూలు జట్టు 25 పాయింట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచి కప్పు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో యోగా క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సంఘం అధ్యక్షుడు అవినాష్ శెట్టి, కార్యదర్శి మునిస్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, శశిధర్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కర్నూలు (టౌన్): ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు బిజినేపల్లి సందీప్ అన్నారు. ఆదివారం టీజీవీ స్పోర్ట్స్, యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు కరాటే వంటి ఉషూ మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయాలన్నారు. ఈ క్రీడల వల్ల ఏకాగ్రత, ధైర్యం అలవడుతుందన్నారు. అనంతరం బెల్ట్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి కలర్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పీజీఆర్ఎస్‌కు హాజరుకావాల్సిందే

సి.బెళగల్: మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమానికి అధికారులు తప్పక హాజరుకావాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. స్థానికులు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఓర్వకల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అధికారులకు అర్జీలు ఇవ్వవచ్చన్నారు. అర్జీలపై సంబంధిత శాఖాధికారులతో విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని బ్రైట్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మాలిక్ బాషా పేర్కొన్నారు. ఆదివారం ఐడెల్ స్కూల్‌లో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు.

రహ'దారిద్ర్యం'

- గుంతలమయంగా మారిన అర్బన్ కాలనీల రోడ్లు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రయాణం నరకప్రాయం



లక్ష్మీపురం రోడ్డు దుస్థితి



గుంతలమయంగా మారిన జొహరాపురం - వెంకాయపల్లె రోడ్డు

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ రోడ్లు, ఇతర రోడ్లను సంక్రాంతి కల్లా బాగు చేస్తామన్నారు. అయితే కల్లూరు అర్బన్, కర్నూలు నగరంతో పాటు 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్‌లో 16 వార్డులు ఉండగా, అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. అయినా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర శివారులోని జోహరాపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి అడుగడుగున్నా గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రహదారి వెంట రోజూ వందల సంఖ్యలో వాహనాలు ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, వెంకాయపల్లె, గార్గేయపురానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రోడ్లను పట్టించుకోవడం లేదనని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో ఎదురుగా ఎద్దైనా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డు వేయడంతో పాటు ఇరువైపులా రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా రోడ్డుపై గుంతలు ఉండడంతో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల దగ్గర ఎదురుగా ఎద్దైనా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

– 44వ జాతీయ రహదారి నుంచి 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దారిలోనే కేజీబీవీ విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. కేజీబీవీ విద్యాలయం ముందు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, కళాశాల విద్యార్థులు, వ్యవసాయ కూలీలు నిత్యం తిరుగుతుంటారు. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఎరువులు, పురుగు మందులను ఎద్దుల బండ్లపై, ద్విచక్రవాహనాలపై తీసుకెళ్తుంటారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టిన రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

రైతుల కష్టాలు పట్టని కూటమి ప్రభుత్వం



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నేతలు కోట్ల హర్ష, సతీష్
- 'అన్నదాత పోరు' పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో యూరియా, ఎరువుల కోసం రైతులు కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం హర్షవర్ధన్ రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ నెల 9న నిర్వహించే ''అన్నదాత పోరు'' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కర్నూలు నగరం చిన్న పార్క్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. రైతులు క్యూలలో నిలబడినా ఎరువులు అందకపోవడం, బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మొద్దునిద్ర పోతున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు కృత్రిమ కొరత సృష్టించి యూరియా బస్తాను రూ.270 నుంచి రూ.450-600 వరకు విక్రయిస్తున్నారని, రైతుల నుంచి రూ.250-300 కోట్ల వరకు దోచినట్లు ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన రైతులందరికీ ఎరువులు అందించినట్లు గుర్తు చేశారు. బయట మార్కెట్ కన్నా బస్తాపై రూ.50 తక్కువతో పంపిణీ చేశారని తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు. ఇప్పుడు ఒక బస్తా యూరియా కావాలన్నా నానా తంటాలు పడాల్సి వస్తోందన్నారు. కూటమి పాలనలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. టీడీపీకి ఓటు వేసినందుకు అందరూ పశ్చాతాప పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో భవిష్యత్తుకు గ్యారెంటీ లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు సోమశేఖరరెడ్డి, మోహన్‌బాబు, తులసిరెడ్డి, నరసింహారెడ్డి, కుమార్‌రెడ్డి, ఎంకే వెంకటేష్, రామక్రిష్ణాయాదవ్, పాండు రంగన్న, గిరిప్రసాద్, మోహన్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, వెంకటేష్, అజీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు విఫలం



పోలకల్‌లో వ్యకాస నూతన శాఖను ప్రకటిస్తున్న నాయకులు

సి.బెళగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనలో విఫలమైందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. ఆదివారం పోలకల్ గ్రామంలో స్థానికుల సహకారంతో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలు పేదరికంలో కొనసాగుతున్నారని, పల్లెల్లో దాడులు, వివక్షత కొనసాగుతూనే ఉందని అన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ప్రజలు వలసలు వెళ్తున్నారని, కార్మికుల వేతనాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కొత్త గ్రామ వ్యకాసను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దిన్నె హనుమంతు, ఉపాధ్యక్షుడిగా మల్లెపోగు రాజన్న, పులదాసు పక్కిరన్న, కార్యదర్శిగా మల్లెపోగు యువరాజు, తదితరులను ఎన్నుకున్నారు. సీపీఐ నాయకులు రాజు, నబిరసూల్, శేషుకుమార్, బీడీల శ్రీను, తిమ్మప్ప, బాషా, బాలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గడివేముల: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, గతంలో వివిధ కేసుల్లో ముద్దాయిలు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రశాంతంగా నెలకొనేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్న కటిపోగు రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సరైన ధ్రువపత్రాలు లేని బైక్‌లను సీజ్ చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బిలకలగూడూరులో బైకులను సీజ్ చేసిన పోలీసులు

గురువులే సమాజ మార్గదర్శకులు

కర్నూలు కల్చరల్: గురువులే సమాజ మార్గదర్శకులు, స్ఫూర్తి ప్రదాతలని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, నైస్‌యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్‌సిటీలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ భవన్‌లో.. ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ సమాజ సేవలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. ఉత్తమ సేవలందిస్తున్న 25 మంది ఉపాధ్యాయులకు అవార్డులతో సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నాగేశ్వరరావు, కేవీ సుబ్బారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ.విజయకుమార్‌రెడ్డి, డీఎస్పీ మహబుబ్ బాషా మాట్లాడారు. కార్యక్రమంలో మురారి శంకరప్ప, డాక్టర్ జయప్రకాష్, గోపీనాథ్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ బాలేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న అతిథులు

రచనలు సమాజ చైతన్యానికి దోహదపడాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు, అతిథులు

కర్నూలు కల్చరల్: రచనలు సమాజ చైతన్యానికి దోహదపడాలని తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ అన్నారు. ప్రముఖ రచయిత కేపీఆర్ శర్మ రచించిన 'కవితా (వి)హారం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం వీఆర్ కాలనీలోని సాయి రాఘవ రెసిడెన్సీలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రచనలో స్త్రీల సమస్యలు, నిరాధరణకు గురువుతూ వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు, రైతులు, సైనికులకు సంబంధించి ప్రధాన భూమిక ఉందన్నారు. డాక్టర్ హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాధాశ్రీ, రంగనాథ శర్మ, కల్యాణ శాస్త్రి మాట్లాడారు. రచయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని పుస్తక సమీక్ష చేశారు. నాట్య గురువులు భార్గవ కుమార్, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కళాకారులకు సత్కారం



డీఈఓ శామ్యూల్‌పాల్‌తో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్: నవ సమాజ నిర్మాతలు గురువులని డీఈఓ శామ్యూల్‌పాల్ అన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం సాహితీ, కళా రంగాల్లో పేరు పొందిన 15 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులకు గురుతరమైన బాధ్యత ఉందన్నారు. కళాకారులైన ఉపాధ్యాయులకు ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని తద్వారా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా సాహిత్య కళారంగాల్లో రాణిస్తున్నవారన్నారు. ఇటీవల మరణించిన రెండు నంది అవార్డుల గ్రహీత వన్నెం బలరాం చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విశ్రాంత ఎంఈఓ రాజారత్నం, కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వర్, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌మియ్యా, సభ్యులు, సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు డాక్టర్ హరికిషన్, దేవేంద్రప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, పుల్లా రామాంజనేయులు, రాముడు, రేవుల శ్రీనివాసులు, మునిస్వామి, చంద్రమౌళిని, కల్యాణదుర్గం స్వర్ణలత, నీలిమ, బాల వెంకటేశ్వర్లు, చంద్రకంటి మద్దయ్య, సుధీర్‌రాజు, భాస్కర్, దాసరి వెంకట రమణ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు రేణుక



ఎస్వీ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి సూచించారు. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన (డిప్యూటీ మేయర్) ఎస్.రేణుక ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి ఉమామహేశ్వరమ్మ, యువ నాయకుడు శివనరసింహారెడ్డిని, అలాగే కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, సతీమణి విజయమనోహరి, అలాగే పార్టీ నేతలు కంగాటి శ్రీదేవి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్‌లను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పని చేసేవారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కె.వీ.రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మీటర్‌కూ షాకే!

- రెండింతలు పెరిగిన విద్యుత్ మీటర్ల ధరలు
- బిల్లులోనే కాదు.. కొత్త మీటర్ కావాలన్నా బాదుడే
- పేదలపై మోయలేని భారం
- అన్ని కేటగిరీ విద్యుత్ మీటర్ల ధరలు పెంచిన ప్రభుత్వం



కేటగిరీ-1 విద్యుత్ మీటర్‌కు రూ.4,209 వసూలు చేసిన వైనం

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ బిల్లులు వినియోగదారులకు షాక్ కొడుతున్నాయి. ప్రతి నెలా ఇదే పరిస్థితి. దీంతో వినియోగదారులు ఎలక్ట్రానిక్ వస్తువులను ఆచితూచి వాడాల్సిన పరిస్థితి. ఇదిలా ఉండగా ప్రభుత్వం పేదలపై మరో బాదుడు మొదలుపెట్టింది. ఎవరికైనా కొత్త విద్యుత్ మీటర్‌కు కావాలంటే గతంలో ఉన్న ధరకు రెట్టింపునకు పైగా మొత్తాన్ని చెల్లించి చలానా తీయాల్సి ఉంటుంది. అంతలా కొత్త విద్యుత్ మీటర్ల ధరలను పెంచేశారు. అన్ని కేటగిరీల మీటర్లకు ధరలను రెట్టింపు చేశారు. దీంతో పేదలు కరెంట్ మీటర్‌ను కొనేందుకు కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతలా ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాన్ని మోపింది. ఇటీవల కొత్తగా ఇల్లు కట్టుకున్న వారికి, చిన్న పరిశ్రమలు, ఇతర అవసరాలకు పెరిగిన ధరలకే విద్యుత్ మీటర్లు కొనాల్సి వస్తోంది.

కేటగిరీల వారీగా విద్యుత్ మీటర్ల ధరలు

పాణ్యం మండలంలో కేటగిరీ-1 గృహాలు - 15210, కేటగిరీ-2 చిరు వ్యాపారులు - 1153, కేటగిరీ-3 పరిశ్రమలు - 60, కేటగిరీ-4 నీళ్ల ట్యాంకులు వీధిదీపాలు - 448, కేటగిరీ-5 వ్యవసాయం - 3499 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గతంలో కేటగిరీ-1 విద్యుత్ మీటర్ ధర రూ.1800 ఉండగా ప్రస్తుతం మీటర్ రూ.4210గా ఉంది. అలాగే కేటగిరీ-2 మీటర్ ధర గతంలో రూ.2700 ఉండగా ప్రస్తుతం రూ.5600 ఉంది. ఇక పరిశ్రమలు ఆయా హెచ్‌పీల వినియోగంపై ధరలు వర్తింపజేస్తారు. ఇప్పుడున్న విద్యుత్ చార్జీల సంగతి అటుంచితే కనీసం విద్యుత్ మీటర్ తీసుకోవాలన్నా భయపడేలా కూటమి ప్రభుత్వం ధరలు పెంచేసింది. దీంతో ఇప్పటికే మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మందికి కొత్త ధరలు అమల్లోకి రావడంతో ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఇంతలా ధరలు పెంచి పేదలపై భరించలేని భారం మోపడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలపై మోయలేని భారం



సామాన్య ప్రజలు కొత్తగా విద్యుత్ మీటర్ తీసుకోవాలంటే పెరిగిన ధరలతో అల్లాడిపోతున్నారు. ఇప్పటికే కరెంట్ బిల్లులు అమాంతం పెంచేశారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు కట్టేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మీటర్ల ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం వేస్తున్నారు. విద్యుత్ మీటర్ల ధరలు రెండితలకు పైగా పెంచడం సరికాదు. –కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు

ప్రభుత్వ విధానంతో ప్రజలకు ఇబ్బందులు



కరెంట్ బిల్లులు అమాంతం పెరిగిపోవడంతో పేదలు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ మీటర్ల ధరలు కూడా పెంచి కొత్తగా ఇల్లు కట్టుకున్న వారిని మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. చిన్న పరిశ్రమలకు విద్యుత్ బిల్లుల్లో ఎలాంటి తగ్గింపు లేకపోగా ఇంకా భారం వేస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పునరాలోచించి విద్యుత్ చార్జీలు, మీటర్ల ధరలు తగ్గించాలి. – భాస్కర్, సీఐటీయూ మండల కార్యదర్శి

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయం

ప్రభుత్వం నిర్దేశించిన మేరకే విద్యుత్ మీటర్లను వినియోగదారులకు అందిస్తున్నాం. పెరిగిన ధర ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని చలానా కడితే మీటర్ ఇస్తున్నాం. – ఏడీ సుబ్రమణ్యం

అరకొర యూరియాతో అవస్థలు

ఓర్వకల్లు: ఒకప్పుడు పుష్కలంగా లభించే యూరి యా కోసం ప్రస్తుతం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అరకొరగా వచ్చిన యూరియా సరిపడక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రోజుకు 300 నుంచి 400 బస్తాలకు మించి రావడంలేదని, వచ్చిన బస్తాలను రాత్రికి రాత్రి డీలర్లకు అనుకూలమైన రైతులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో గత వారంలో హుసేనాపురం, బ్రాహ్మణపల్లె ఆర్ఎస్‌కేలకు చాలీచాలని స్థితిలో యూరియా వచ్చింది. దీంతో కొందరు మంది రైతులు ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లి కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం లొద్దిపల్లె, ఉప్పలపాడు గ్రామాల్లోని రెండు రైతు సేవా కేంద్రాలకు కలిపి 450 బస్తాల మేర యూరియా వచ్చినట్లు వ్యవసాయాధికారి మధుమతి ఆదివారం తెలిపారు. ఒక రైతుకు కనీసం 1-2 బస్తాల చొప్పున ఇవ్వడం జరుగుతోందన్నారు. ఆయా గ్రామాల రైతులు యూరియా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తైక్వాండో సీనియర్ శిక్షకులు టీ.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో విద్యార్థులకు తైక్వాండో మెళకువలు నేర్పించారు. విద్యార్థులచే ఫైట్ కురుగురే, కటాస్, పుంసే వంటి ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



పొలంలోకి దూసుకెళ్లిన బైకు



క్షతగాత్రున్ని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు-వెల్దుర్తి రోడ్డు వినాయక ఘాట్ సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు..మండలంలోని గోరంట్లకు చెందిన బాలు బైక్‌పై కోడుమూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మరోవైపు దేవనకొండ మండలం కప్పట్రాళ్లకు చెందిన లాల్‌బాషా, రంగస్వామి ఇద్దరూ మరో బైక్‌పై వస్తుండగా వినాయక ఘాట్ వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలు, లాల్‌బాషాలకు తీవ్ర గాయాలు కాగా, రంగస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోడుమూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.